సంఘు సభ్యుల రుచులను సమయ మెరిగి
స్వార్థ మైనను విడనాడి సంఘమునకు
మేలు చేకూర్చు విధమున మెలగవలయు
నొవ్వ సేయకు ఇతరుల నొచ్చుకొనకు.
పాలు చిలికిన వెన్నను బడయ వచ్చు
నీరు చిలికిన తప్పక నిప్పు వచ్చు
పనికిమాలిన మాటల విలువ సున్న
మరువ బోకుడు యిటువంటి మంచి మాట.
ప్రజల కింపైనట్టి పనులు చేయక యున్న
మాట యింపుగ పల్కు మసలరయ్య
సత్సంగమున చేరి సంఘ వృద్ధిని గాంచి
కర్మయందనురక్తి కలగరయ్య
పశులక్షణము వీడి పశుపతి కావలె
నరుడవై మానవోద్ధరణ సలుపు
దయగల హృదయమే దైవ మందిర మౌను
దయలేని హృదయము దయ్యమయ్య
అహము పరనిందలను పాడు కుళ్ళును దోసి
సర్వజీవుల కలడొక్క సర్వేశుడను
భావము వదలకున్నను సార్థకంబౌ
సార్థకంబౌను శ్రీసాయి సంస్థలన్ని.
పూర్ణప్రేమయందె పుట్టును సౌఖ్యంబు
సత్త్యాగ నిరతి శాంతులబ్బు
ప్రేమ లేక యున్న క్షేమంబు లేదయా
సత్యమైన బాట యీ సాయి మాట.

ప్రేమ స్వరూపులారా!

ప్రేమ త్రిగుణాతీతమైనది. అనంతమైనది. అమృతమయమైనది. అవిరామముగా ప్రవహించే అమర జ్యోతి యీ ప్రేమ. దీనినే ఋషులు ఆత్మ అని పిలుస్తూ వచ్చారు. ఇట్టి ప్రేమ స్వరూపమైన ఆత్మ సర్వుల హృదయమునందు కూడను వెలుగుతూనే వున్నది. ప్రేమ, ఆత్మ, హృదయము కేవలము దైవత్వమునకు పర్యాయ పదములే. ఇట్టి ప్రేమకు తన పర అనే భేద భావములు ఏమాత్రము లేవు. స్వార్థరహితమైనది ప్రేమ. కనుకనే ప్రేమ స్వరూపిణం అని వేదాంతము పలుకుతూ వచ్చింది. ప్రేమమంతెన ఒక దిక్సూచి వంటిది. ఇది ఎక్కడ పెట్టినప్పటికిని ఉత్తరము వైపునే తిరుగుతూ వుంటుంది. ఎప్పుడుగాని, ఎక్కడగాని, ఏ పరిస్థితి యందుగాని ప్రేమ నిరంతరము భగవంతునివైపునే నడిపింప చేస్తుంది. కనుక ప్రేమ తత్త్వమును అర్థము చేసుకొనుటకు ప్రతి వ్యక్తి ప్రయత్నించాలి.

ప్రేమకు ప్రేమనే సాటి. ప్రేమకు ప్రేమనే ఫలము. ప్రేమకు ప్రేమయే రుచి. ఈ ప్రేమ యొక్క తత్త్వాన్ని మరొక దీనితో పోల్చటానికి వీలుకాదు. ఈ ప్రేమను వర్ణించుటకు భాషగాని, కవిత్వముగాని యీ జగత్తునందు కానరాదు. కనుకనే యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ అని. మనస్సునకుగాని, వాక్కునకుగాని అతీతమైన తత్త్వము యీ ప్రేమ యొక్క తత్త్వము. ప్రేమ, అనురాగము రెండు ఒక్కటే. ఐతే యీ అనురాగమనేది ప్రపంచ విషయవాసనలపై మరల్చినప్పుడు కొంత మాలిన్యమవుతుంది. ఈ మాలిన్యము చేత సుఖదుఃఖములు ఏర్పడుతుంటాయి. ఆశానిరాశలకు గురౌతుంటాడు మానవుడు. కాని ప్రేమ భగవంతునిపై మరల్చినప్పుడు యిది నిత్యసత్య నిర్మలమై నిస్వార్థమై, నిరయుకమై, దివ్యమైన రూపమును ధరిస్తుంది. దీనినే

నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం
నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణం

అని వేదాంతము వర్ణించింది. అమృతము అతి మధురమైనదని శాస్త్రములు బోధిస్తూ వచ్చాయి. కాని ప్రేమామృతమందు ఏ మాత్రము కూడను గిట్టదు. ప్రేమ ముందు అమృతము చప్పిడిగా మారిపోతుంది. ఇట్టి పవిత్రమైన ప్రేమ తత్త్వాన్ని సామాన్యమైన మానవులు అర్థము చేసుకొనలేరు. ఇట్టి ప్రేమ కేవలము ఒక ఆనందమయ సాగరము మథనము చేసినప్పుడు పుట్టే పవిత్రమైన స్వరూపమే.

నామామృతమనే సముద్రమును మథనము చేసినప్పుడు ఆవిర్భవిస్తుంది యీ ప్రేమ అనే సుధ. సకల శాస్త్ర యితిహాస పురాణములను మథించినప్పుడు వెలువడే సుధానిధి యీ ప్రేమ. కనుక ప్రేమ చేత మన కర్మలు ఆచరించాలి. ఐతే సామాన్యముగా యీ లోకములో మానవుల యొక్క ప్రేమ బాహ్యమైన స్వరూపాన్ని ధరిస్తున్నది. శుద్ధమైన అపరంజి చేత నగలు చేయు కంసాలి దానిలో రాగి

వెండి ఇలాంటి లోహములు కలపటంచేత ఆ బంగారు వర్ణము దాని విలువ కొంతవరకు తగ్గుతుంది. అదే విధముగా పరిశుద్ధమైన ప్రేమ తత్వమునకు లౌకిక విషయములు చేరిపోవటం చేత యీ శుద్ధమైన ప్రేమ కొంతవరకు అశుద్ధముగను, మాలిన్యముగను మారిపోతుంది. ఇట్టి మాలిన్యమైన ప్రేమను నిస్వార్థ సేవలోపల మర్ధనము చేసినప్పుడు యీ మాలిన్యము తొలగి శుద్ధమైన ప్రేమగా రూపొందుతుంది.

నిజముగా మానవుని యొక్క జన్మస్థానము ఏమిటి? ఎక్కడ నుండి పుట్టేడు? ఎందుకోసం పుట్టాడు? ఎక్కడవున్నాడు? అనే విషయాన్ని విచారించటం అత్యవసరము. కానీ సామాన్యముగా మానవుని యొక్క దృష్టి లౌకికమైన దృష్టిగానే రూపొందుతుంది. ఈ వృక్షములు ఎక్కడనుంచి పుట్టియంటే ప్రతి మానవుడు భూమి నుంచి పుట్టియంటాడు. ఇది సరియైన జవాబు కాదు. విత్తనము నుండి పుట్టాయిగాని భూమి నుండి కాదు. ఎడారిలో కూడా భూమి వున్నది. కాని అక్కడ వృక్షములు వచ్చుచున్నవా? కారణం అక్కడ విత్తనములు లేవు. కనుకనే విత్తనము వృక్షమునకు మూలాధారమైనట్లుగా మానవుడు మనుజ అనే విత్తనమునుండి ఉద్భవించాడు. మనువునుండి పుట్టినవాడు కనుక యితనికి మనుజుడు అని పేరు వచ్చింది. ప్రతి మానవుడు కూడను మను సంతతి వాడే. మనువు ఋషి సంతతి వాడు. ఋషి అనగా పరమ జ్ఞాని. స్వప్రకాశమైన జ్ఞాన స్వరూపమే ఋషితత్త్వము. కాని స్వప్రకాశమైన జ్ఞానమునుండి ఆవిర్భవించిన మానవుడు అజ్ఞానములో వుండటానికి కారణము ఏమిటి? తన స్వస్థానాన్ని తాను మరచాడు. స్వస్వరూపమును తాను మరచాడు. బాహ్యమైన యీ జగత్సారములో తాను మునిగినాడు. కనుకనే యీ విధమైన విచారమును పొందుతున్నాడు మానవుడు. స్వచ్ఛమైన ప్రేమ తత్వాన్ని తాను అర్థము చేసుకొనలేక అనేక విధములుగా యీ దేహమును అనుభవిస్తున్నాడు.

గొంతువరకు నీటిలో వున్నవాడు మాట్లాడగలడు. కాని నీటిలో పూర్తిగా మునిగినవాడు మాట్లాడలేడు. అటులనే పూర్ణప్రేమ యందు మునిగిన వ్యక్తి ఎట్టి వర్ణనలు చేయలేడు. పైపై అలలపై తేలే వ్యక్తులే వర్ణించటానికి ప్రయత్నిస్తారు. కనుక దివ్యమైన తత్వాన్ని ఏరీతిగా వర్ణించటానికి వీలౌతుంది. ఇట్టి దైవత్వమును ఏరీతిగా చూడటానికి సాధ్యమవుతుంది. దీనికి ఒక మూలాధారము. కొంతమందికి దైవత్వము సాక్షాత్కారమవుతుంది. కొంతమంది ఏవిధమైన సాధనలు చేసినప్పటికిని సాక్షాత్కారమును నోచుకోలేకపోతుంటారు. కారణం ఏమిటి? అనేక రకములైన జపమాలలుంటాయి. రుద్రాక్ష జపమాలలు వుంటాయి. తామర బీజముల మాలలుంటాయి. పగడములవి వుంటాయి. ఈ పూసలలో చేరిన దారము ఎవరికి కనుపించదు. కాని ఒక్క స్ఫటికములో చేరిన దారమే కనుపిస్తుంది. అన్నింటి యందు దారము వుంది. కాని కనుపించేది మాత్రం స్ఫటికమునందు మాత్రమే కనుపిస్తుంది. అటులనే అందరియందు బ్రహ్మసూత్రమనే దారము సమానంగానే వుంటుంది. పరిపూర్ణ ప్రేమ అనే

పరిశుద్ధ స్ఫటికము నందు మాత్రమే ఈ విధముగానే దైవత్వము గోచరిస్తుంది. కనుక దైవత్వమును వర్ణించుటమంటే ఏవిధముగా ఎవ్వరికి సాధ్యము కాదు. కబీరు చెప్పాడు.

నిను కనుగొనగలమా కృష్ణా నిను కనుగొన గలమా
అణువు కంటె అతి సూక్ష్మ రూపుడవు
ఘనము కంటె అతి ఘన నయుడవు
84 లక్షల జీవుల అనయంబున నెడబాయకుందువట
అణువు మొదలు కొన్నను మొదల అఖండరూపుడవై వెలయుదువట.॥

అణువునందు, ఘనమునందు, సర్వమునందు నిండిన నిన్ను ఏరీతిగా స్తుతించుటానికి సాధ్యమవుతుంది.

సూక్ష్మమైనట్టి అణువున సూక్ష్మమగుచు
మేటి వస్తువు నందున మేటి యగుచు
అంతట తాను నిండిన ఆత్మవిభుడు.

వేదాంతము 'అణోరణీయాన్ మహతో మహీయాన్' అనింది. ప్రతి మానవుడు కూడను ప్రతి వ్యక్తి యందు వుండిన దైవత్వాన్ని గుర్తించి ఎక్కడ సేవ చేసినా, ఎవరికి చేసినా నా దైవానికే చేస్తున్నాననే భావమును దృఢము చేసుకోవాలి. ఈ సేవయే నిజమైన సాధన.

కబీరు కూడా చెప్పాడు. రామా నేను జపతపయజ్ఞయాగాదులు ఏమాత్రము చేయటానికి సాధ్యము లేదు. ఏ విధముగా చేయాలనే అంతరార్థము నాకు అర్థము కాదు. ఈ సాధన చేయటంలో నాకు తృప్తి లేదు. నాకు ఒక్కటే సాధన అదియు ప్రేమ సాధన. ఆ ప్రేమచేతనే నిన్ను పొందటానికి తగిన మార్గమును కల్పించు. ప్రేమ మాత్రమే సరియైన మార్గము నాకు. అన్యమార్గములో నేను ప్రయాణము చేయలేను. కనుక ప్రేమచేత సర్వులను ప్రేమించి దివ్యమైన ఆత్మానందమును అనుభవించాలి. ఈ విధమైన ప్రేమ మార్గములో సేవలో ప్రవేశించినప్పుడు యావత్ప్రపంచము ఒక్క కుటుంబముగా మారిపోతుంది. ప్రాచీన కాలమునుండి భారతదేశము యిట్టి పవిత్రమైన సేవామార్గము నందిస్తూ వచ్చింది. కేవలము యిది ఒక భారతీయులు మాత్రమే చెప్పే విషయము కాదు. మొగలు సామ్రాజ్య చక్రవర్తి ముస్లిం చక్రవర్తి బాబర్ కుమారుడు హుమయున్ కు బాబర్ ఒక పెద్ద లెటర్ వ్రాసాడు. ఆరాధనా సంస్కృతికి ఆలవాలమైనది భారత దేశము. అన్ని మతముల వారికి ఆశ్రయమిచ్చిన విశాల హృదయము గలది భారత దేశము. భారతీయ సంస్కృతి మహా విశిష్టమైనది. దీనిని వర్ణించుటకు ఎవరికి సాధ్యము కాదు. అనాది కాలమునుండి యిటువంటి సంస్కృతిని భారతీయులు కాపాడుకుంటూ వచ్చారు. ఏ మతమునందు యీ విధమైన నియమములు లేవు. ఇట్టి పవిత్రమైన దేశమునకు

నీవు చక్రవర్తి కావటము చాలా అదృష్టము. అదృష్టము నందించిన భగవంతునకు జీవితమంతా కృతజ్ఞతగా వుండాలి. భారతీయుల ఆరాధనా సంస్కృతికి నీవు ఏ మాత్రము అడ్డు తగలకు. నీ కర్తవ్యము ను నీవు నిర్వర్తించు. ఏదైనా ఒక నిర్ణయమునకు నీవు రావాలను కున్నప్పుడు భారత దేశములో వున్న పెద్దలను సమావేశ పరచి వారి సలహాలను తీసుకుంటూ వుండు. ఈ విధమైన మార్గము నీవు అనుస రించకున్న నీ యొక్క జీవితమే పతన మవుతుందని వ్రాసాడు. భారతీయ సంస్కృతి సర్వమత సమన్వయమైనదని వ్రాసాడు. ఈ సేవ, త్యాగము, ధర్మము, ప్రేమ మతమునకు ఉపాంగములని పేర్కొ న్నాడు. కనుక ఇట్టి పవిత్రమైన భారతీయ సంస్కృతి యందు సేవా భావము ఎంతో భాసిస్తూ వుంటున్నది.

అట్టి పవిత్రమైన భారత దేశము నందు యీనాడు సేవకులు కరవై పోవటం చేతనే భారత దేశము అనేక అవస్థలకు గురౌతున్నది. సేవకత్వమే నాయకత్వమనే దృఢమైన విశ్వాసము మనము అభివృద్ధి పరచుకోవాలి. కనుక సేవా సంస్థలందు యిట్టివారు అట్టివారు అనే నిర్ణయము ఏ మాత్రము చేయకూడదు. అందరూ సేవా సంస్థలలో ప్రవేశించాలి. అసలు మానవత్వము రావటమే సేవ నిమిత్తము. ఎంత ధనమున్నా, ఎంత బలమున్నా, ఎంత విద్య వున్నా సేవా తత్వములో వున్న శక్తిసా మర్థ్యములు మరి యేని యందు మనకు కానరావు. హనుమంతుడు గుణవంతుడు బలవంతుడు. అలాంటి బలవంతుడైన హనుమంతుడు అశోక వనమున ప్రవేశించినప్పుడు రాక్షసులందరు యీ కొత్త స్వరూపాన్ని వికార స్వరూపాన్ని విచిత్రముగా చూచి ప్రశ్నిస్తూ వచ్చారు. 'ఎవరయ్యా మీరు' అని అడి గారు. ఆ హనుమంతుడు ఎంత చల్లగా జవాబు యిస్తున్నాడు తెలుసునా! తన బలము, తన గుణము తన శక్తిని యేమాత్రం విశ్వసించకుండా 'దాసోహం కోసలేంద్రస్య' నేను రామ చంద్రుని దాసుడను అని మొట్టమొదట ఎరుక యిచ్చుకున్నాడు. కనుక దైవ సేవకుడుగా వుండటం అనేది ఎంత గొప్పదిలో మీరు చక్కగా వూహించాలి. సకల లోకములను సృష్టికర్త యైన కృష్ణుడు, సకల శక్తివంతుడైన కృష్ణు డు కేవలము అర్జునుని రథము తోలుటకు సిద్ధపడ్డాడు. సేవాభావమనేది అనాదినుండి భగవంతు నకు అర్పింప బడుతున్నది. ప్రతి మానవుడు దైవాంశ సంభూతుడే. ఓ మానవుడా! నీవు పంచభూత స్వరూపు డవు కాదు. నీవు పరిమిత బింబము కాదు. పంచేంద్రియ స్వరూపుడవు కాదు. నీవు సనాతనమైన నా అంశవే. ఇట్టి భావాన్ని మొట్టమొదట సేవకుల హృదయాల్లో భద్రము చేసుకోవాలి. అప్పుడే యీ సేవ యందు ఎట్టి లోపములు లేకుండా హృదయ పూర్వకముగా సేవలు సల్పగలరు.

ప్రేమ స్వరూపులారా! మానవత్వమనేది కేవలము సామాన్యమైనది కాదు. జంతూనాం నర జన్మ దుర్లభం. మాణిక్యము వంటి యీ మానవత్వమును మసిబొగ్గులకు అమ్ముకుంటున్నాము. సార్థకము గావించుకునే

యదార్థమును మనం గుర్తించు కోవాలి. భగవంతుని ఎన్ని రకముల పూజించినప్పటికిని చిత్త శుద్ధి యే లేకుండిన యివన్ని వ్యర్థమై పోతాయి.

ముక్తి కోరి నరుడు ముక్కోటి దేవతల
వేడు చుండు గాని వెతలు బోవు
తనదు లోని అహము తొలగింప గలిగిన
ముక్తి యేల తానె ముక్తి కాదె.

అహంకార మనగా ఏమిటి? దేహము నేను అనుకోటం అహంకారము. నీవు దేహము కాదు నీవు దేహివి. దేహము నీ పని ముట్టు. కారులో కూర్చుని కారు డ్రైవు చేస్తున్నంత మాత్రమున డ్రైవరు కారౌతాడా.? కాదు కాదు. దేహమనే కారు నందు దేహి అనే వాడు డ్రైవు చేస్తున్నాడు. తాను తానుగానే వుంటాడు. తాను కారు కాదు. ఈ విధమైన సత్యాన్ని వేదాంతము అనాది కాలము నుండి విచారిస్తూ, వివరిస్తూ, బోధిస్తూ వచ్చింది.

లోకములో అద్వైతమని, విశిష్టాద్వైత మని రెండు విధములైన మార్గములను ప్రచారము చేస్తూ వచ్చారు ప్రాచీన కాలము నుండి. ఐతే అద్వైత, విశిష్టాద్వైత ములకు పెద్ద భేదములు లేవు. ఈ అద్వైతమును గురించి అనేక మంది పండితులు అర్థము కానటువంటి బోధనలంతా సంక్లిష్టమైనవిగా మానవుని మనసును బెదిరిస్తూ వచ్చారు. అద్వైతమనగా సర్వులయందు వున్నది ఒక్కటే. కాని ఎవరి పని వారు చెయ్యాలి. విశిష్టాద్వైతమునకు, అద్వైతమునకు వున్న భేదము మనము కొంతవరకు గుర్తించాలి. అద్వైత మనగా చెఱుకులో వున్న చక్కెర. చెఱుకులో వంపులు లేకుండా ఏకత్వముగా వున్న ఆ మాధుర్యమును అనుభవించి యిదే అద్వైతమని బోధించిన వాడు శంకరుడు. మానవుని యొక్క దేహము ఒక sugar cane వంటిది. అనేక రూప నామములతో వుండ వచ్చును. అనేక రాగద్వేషములతో వుండ వచ్చును. అనేక యిచ్ఛ అయిచ్ఛలతో కూడి వుండవచ్చును. కాని అన్నింటి యందు వున్నది యీ మధురమైన దివ్యమైన దైవ రసము ఒక్కటే. అని బోధిస్తూ వచ్చారు శంకరులవారు. కాని సామాన్యమైన మానవులకు అంత సులభముగా అర్థమయ్యేది కాదు. తిరిగి విశిష్టాద్వైతమును రామానుజులవారు వివరిస్తూ వచ్చారు. రసము ఒక్కటే కాని ఆ రసమును చక్కెరగా మార్చి వివిధ వస్తువుల యందు దానిని చేర్చి అనుభవించ వచ్చు అన్నాడు. బియ్యపు పిండిలో కలుపుకొని చక్కెరను ఒక పదార్థముగా మార్చుకోవచ్చు. మైదా పిండిలో కలుపుకొని యింకొక రకమైన రుచిగా మనము అనుభవించ వచ్చు. కాఫీలో కలుపుకోవచ్చు. జ్యూస్ లో కలుపుకోవచ్చు. అన్నింటిలో యీ చక్కెర కలుపుకో లేనిది విలువుంటుంది. ఈ అద్వైతమునకు విశిష్టాద్వైతమునకు వుండిన భేదమేమంటే కేవలము రస

స్వరూపమైనదే అద్వైతము. ఈ రసమును చక్కెరగా మార్చుకొని అన్ని పదార్థములందు చేర్చి అనుభవింప చేయటానికి తగిన ఉపాయము వెతికినవాడు కనుక విశిష్టమైన అద్వైతముగా రామానుజులవారు బోధించారు.

ఇందులో చక్కెర ఏమిటి? అదే ప్రేమ. ప్రేమ. ప్రేమ. ఈ ప్రేమ అనే చక్కెరను భార్యాభర్తలలో కలిపినప్పుడు యిది కేవలము మోహమని అనుభవిస్తున్నారు. ఈ చక్కెరను తల్లి బిడ్డలలో కలుపుకొని వాత్సల్యమని అనుభవిస్తున్నారు. ఇదే ప్రేమను వస్తువులతో చేర్చుకొని యిష్టమని అనుభవిస్తున్నారు. ఇదే ప్రేమను బంధు మిత్రులలో చేర్చుకొని అనురాగమని అనుభవిస్తున్నారు. ఇదే ప్రేమను భగవంతునిపై మరల్చి భక్తి అని అనుభవిస్తున్నారు. ప్రేమ పవిత్ర అద్వైత రసము యొక్క స్వరూపము. యిలాంటి పవిత్రమైన యదార్థ స్వరూపము మనం గుర్తించినప్పుడు ఎట్టి సందేహములకు అవకాశము వుండదు. ఈ ప్రేమ తత్వమును మరొక మార్గములో యోగరూపములో మరల్చినారు. దీనినే ప్రాణాయామ తత్వమని వ్యవహరిస్తూ వచ్చారు. ఇది హంస గాయత్రిగా రూపొందుతూ వచ్చింది: ఈ హంస గాయత్రి అంటే ఏమిటి? సో...హమ్. యిదే సోహం. గాలిని తీసుకోటము, గాలిని వదలటము. రెండింటి యొక్క తత్వమునకే హంసగాయత్రి అన్నారు. ఐతే యీ సోహం అనేదానిలో కూడను ద్వైతం వుంటున్నది. కాని అంతర్ముఖముగా విచారణ చేసినప్పుడు సో అనే గాలిని తీసుకోటం లోపల సకారము silent అయిపోతుంది. మనము జాగ్రదవస్థయందు ఉచ్ఛ్వాస నిశ్వాసములు జరిగినప్పుడు సోహం సోహం అనుకుంటాము. కాని నిద్రావస్థయందు యిది సోహంటి పలకదు. చాలామంది గురక తీసే వారిని విచారణ చేస్తే సోహం అంటారు. సో అనేదానిలో సకారం పోతే ఓ అవుతుంది. హం అనేదానిలో హకారము పోతే మ్ అవుతుంది. ఓ+మ్ = ఓమ్ ఏకాక్షరమై పోతుంది. అదే ఓం. ఈనాడు ప్రతివాడూ ప్రాణాయామం చేస్తూనే వున్నాడు. ఉచ్ఛ్వాస నిశ్వాసములు తీసుకుంటూనే వున్నాడు. అది కాదు నిజమైన ప్రాణాయామము. పవిత్రమైన, మంచివైన విషయాలను లోపలకు తీసుకోవాలి. లోపలను పెట్టుకోవాలి. మనము వదలివలసినది. లోపలనున్న చెడ్డనంతా వదలాలి. ఈ తీసుకున్న వాటిని మనం నిలుపుకోవాలి. తీసుకోటమే పూరకము. వదలటమే రేచకము. నిలుపుకోటమే కుంభకము. ఇదే నిజమైన యోగముగా వేదాంతము బోధిస్తూ వచ్చింది. కాని యిట్టి నిజమైన వేదాంత పలుకును ఎవరు కూడను లక్ష్యము చేయటం లేదు. భౌతికమైన దేహములో ఆచరించే యోగాభ్యాసములే ప్రధానముగా విశ్వసిస్తారు. ఏమిటి యీ దేహము? దీనిలో ఆచరించేదంతా దివ్యత్వాన్ని పొందింపచేస్తాయా? మనస్సులో చెయ్యాలి. ఈ ప్రాణాయామమంతా మనస్సును సంబంధించినది కాదు. కేవలము దేహమునకు సంబంధించిన

మాత్రమే. కనుక దేహముతో బాటు మనసును చేర్చి సేవలు ఆచరించినప్పుడే అదే దివ్యమైన యోగము.
దీనినే భగవద్గీతయందు కర్మణ్యేవ అధికారస్తే. నీకు కర్మాధికారమే వుంటున్నది.
కర్మ ఆచరించు. ఈ కర్మయందున్న ఆనందము మరిదేనియందు కానరాదు. కనుక కర్మాచరణ
యందు మానవుడు మనస్సును చేర్చి యీ మనస్సు ద్వారా సేవలు సల్పినప్పుడు నిజమైన సాధనగా
రూపొందుతుంది. ఇట్టి మనసు లేక చేస్తున్న సాధనలు కేవలము నిరుపయోగమైనవే. దేహము
సత్యము కాదు. పనిముట్టు మాత్రమే. కాని పనిముట్టును మనస్సనే దానితో చేర్చుకొని తద్వారా క్రి
యలో ప్రవేశపెడుతూ వుండాలి. కనుకనే వేదాంతమునందు 'మనయేవ మనుష్యాణాం కారణం
బంధ మోక్షయోః' అన్నారు.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహ నిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు చూడ నా
దేహియె దేవదేవుడు మదిన్ తలపోయగ నాత్మరూపుడౌ

ఆ దేహ తత్వాన్ని మనం గుర్తించాలి. ఆ దేహి అనే దివ్యతత్వము సర్వులయందు వుంటున్నది. కను
క ఎవరికి సేవ చేసినా దైవమునకు సేవ చేస్తున్నానని విశ్వసించాలి. ఈ సేవ ద్వారా మనస్సు పవిత్ర
మై పోతుంది. దేహము కూడను సార్థకమవుతుంది. మనస్సు పవిత్రము కాక దేహము వుండి
ప్రయోజనము లేదు.

మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవక గంప జాతసం
చలనము పొందుచుండు భవసాగర మీదగ లేని కంపలం
బులపాలి తెమ్మ చూడ మన మెప్పుడు దలంపగ దేహ మింక ని
శ్చలమని నమ్మ బోకు మనసా హరిపాదము లాశ్రయింపవే!

కనుక మనస్తత్వాన్ని మనం చక్కగా అభివృద్ధి గావించుకోవాలి. మనస్సును తన స్వస్వరూపాన్ని
మనం అనుభవింప జేయాలి. మనసు నిరంతరము స్వచ్ఛమైనదే. ఈ వస్త్రము తెల్లనిదే. కాని మన
ము అనేక రకములుగా ఉపయోగపెట్టుకోటం వలన యిందులో మాలిన్యము చేరుతున్నది. ఈ
మాలిన్యము చేరినప్పుడు మనం యేమి చేస్తాము. తీసుకువెళ్ళి చాకలికి వేస్తాము. చాకలివాడు మాలి
న్యము తీసుకొని వస్తాడు.. అప్పుడు మనం యేమంటాం. చాకలివాడు తెల్లగ చేసుకు వచ్చాడు
అంటాం. చాకలివాడు దీనికి తెలుపుతనమందించలేదు. దీనిలో వున్న మాలిన్యమును తీసాడు. ఈ
వస్త్రము తన స్వస్వరూపాన్ని ధరించింది. మనసు సహజముగా నిర్మలము. ప్రాకృతమైన జీవితములో

దీనిని అనుభవింప జేయటంచేత ఈ పవిత్రమైన మాలిన్యము దీనికి అంటుకుంటున్నది. దానిని ప్రేమతో పవిత్రము చేసినప్పుడు స్వస్వరూపమును పొందుతుంది.

ప్రేమ స్వరూపులారా! ప్రేమ చేతనే ప్రేమను పొందండి. గోపికలు కూడను ప్రార్థించారు.

ప్రేమ రహితమగు భూములలో ప్రేమాంకురములు పెంపొందా
ప్రేమావేశముతో ప్రేమసుధావర్షము - వర్షింపగ ప్రేమనదులు
ప్రవహింపగ మురళీ గానము చేయగదే కృష్ణాగానము చేయగదే!

ప్రేమ ఎండిపోయిన ఈ దేహమందు ఏమాత్రము ఆనందము వుండదు. ప్రేమ వర్షమును కురిపించు. ప్రేమనదులు ప్రవహింపజేయి. ప్రేమ అనే జలము ఈ హృదయమనే భూమికి పెట్టు. తద్వారా ప్రేమ బీజములు నాటి ప్రేమ అనే వృక్షములచేత ప్రేమ ఫలము మనము అనుభవించటానికి వీలవుతుంది. అనేకత్వమునుండి ఏకత్వాన్ని జేసేది ఒక్క ప్రేమ మాత్రమే. ప్రేమ అనే పాశము చేత అందరు ఒకటిగా కట్టుబడి పోతున్నారు. ఇది ఒక్క ప్రశాంతి నిలయములో తప్ప ప్రపంచములో ఎక్కడను చిక్కదు. ఇన్ని నేత్రములుంటున్నాయి. వేరే సమావేశములో యింతకంటె యింకా యింకా గొప్ప జనము చేరవచ్చు. కాని వారి దృష్టి అనేక రకములుగా చలిస్తూ వుంటుంది. స్త్రీలు, వృద్ధులు మొదలు బాలుర వరకు దృష్టి ఒకేవైపున ప్రసరిస్తూ వున్నది. దీనికి కారణం ఏమిటి? ప్రేమయే. ఈ సమావేశములో అనేక అనానుకూలములంతా జరిగినాయి. కాని యీ ప్రశాంతి నిలయ వాతావరణములో పరిశుద్ధముచేత గాని నిలయములో వుండిన వారియొక్క భద్రతలు గాని యివన్నియూ కూడను ప్రేమ చేతనే చేయబడుతూ వచ్చాయి. ఈ ప్రేమ చేతనే యిన్ని కార్యాలలో విజయాన్ని సాధిస్తూ వచ్చాము. ఈ హృదయమును శాంత పరిచేది ప్రేమనే.

మన ప్రేమ శాంతముగా వుండినప్పుడు ప్రకృతి కూడను శాంతముగా వుంటుంది. ఒక చిన్న ఉదాహరణము. మీకు తెలిసినదే. నిన్నటి దినము 7-30 గంటలకు మేఘములంతా ఒక్కచోట చేరిపోయాయి. కుంభవర్షము కురిపించటానికి సంసిద్ధముగా వుంటున్నాయి. కాని చేరిన లక్షలాది మందికి యీ condition అందించి పోయింది. కనుక మంచి కార్యములు మంచి భావములు మనలో వుండినప్పుడు ప్రకృతి కూడను మనలను అనుసరిస్తుంది. దానికి రామాయణము ఒకటే ప్రత్యక్ష నిదర్శనము. సీత భూజాత. అట్టి భూజాత సీతను అన్వేషించటానికి రాముడు ప్రయత్నించాడు. కానీ సీతను అన్వేషించటం లోపల రాళ్లు, ఉడుతలు, కోతులు ప్రకృతి అంతా సహాయమై పోయింది. కనుక మన హృదయాలు ఒకటి కావటం చేతనే, సాయి ప్రేమస్వరూపుడు

ప్రకృతి అంతయూ దాన్ని అనుసరిస్తూ వచ్చింది. మన కార్యక్రమములో యే మాత్రము అడ్డు తగలలేదు. అడ్డు తగలక పోవటం అటుంచి సహాయము చేస్తూ వచ్చాయి. ఈనాడు తెల్లవారి 7గంటలు 8గంటల లోపల యీ ప్రజలు యిక్కడ కూర్చోటానికి వీలౌతుందా? కాదు. చక్కగా గొడుగు పట్టినట్టుగా ప్రశాంతమైన వాతావరణాన్ని యిచ్చింది. భగవత్ తత్వము లోపల ఎన్నో అర్థాలుంటున్నాయి.

సహనా వవతు - సహనౌ భునక్తు
సహ వీర్యం కరవావహై.

వేదం ఏనాడో చెప్పింది నాయనా!

కలసి మెలసి తిరుగుదాం కలసి మెలసి పెరుగుదాం
కలసి మెలసి కలిమి చెలిమి బలిమి సఖ్యము పెంచుదాం
కలసి మెలసి తెలుసుకున్న తెలివిని వెలిగించుదాం
కలసి మెలసి కలిమి లేద చెలిమిగ జీవించుదాం.

కలసి మెలసి వుంటే ఎంత ఆనందాన్ని అనుభవించగలము. కనుక ఐకమత్యమే బలము. దాని యొక్క ఆచరణలో మన ఆనందము. కనుక ఐకమత్యము మనము అభివృద్ధిగావించుకోవాలి. ఐకమత్యము కావాలంటే ఏకాత్మ భావమును పెంచుకోవాలి.

దివ్యాత్మ స్వరూపులారా! ఈనాడు మన సమావేశము పరిపూర్ణస్థితిని పొందింది. ఇక్కడ వుండినంత మాత్రమున చాలదు. ఈ పవిత్రమైన భావములు మీరెక్కడకు పోయినకూడను మీ దేహమును నీడ వెంటాడినట్లుగా యీ భావములు మీ చిత్తమును వెంటాడుతూ రావాలి. ఇంత మాత్రమున మనము తృప్తి పడరాదు. మీ మిత్రులను, మీ బంధువులను యిందులో ప్రవేశపెట్టి సేవా కార్యక్రమమును సార్థకమయ్యే దానిక్రింద వుపయోగపడాలి. ఎవ్వరు గూడను భయపడనక్కర లేదు. ఎవ్వరు ఏ విషయములో సేవలో మనము సిగ్గుపడనక్కరలేదు. నీవు భయమును సిగ్గును ప్రక్కన పెట్టాలి. నేను చేసే కార్యము పవిత్రమైన కార్యమని సేవాకార్యక్రమములో దృఢమైన విశ్వాసములో ప్రవేశించాలి. ఏమిట్రా రోడ్లు వూడుస్తున్నాడే అని ఎవరైనా అనుకుంటారో యేమోనని అభిమానము వుండినంతవరకు మనము సేవలో యే మాత్రము ప్రవేశించలేము. ఈ సేవలో మంచి చెడ్డ అనే భేదము లేదు. ఎక్కడ, ఎప్పుడూ, ఏ విధంగా, ఎవరికి సేవ చెయ్యాలో ఆ సేవ చేసే తీరాలి. ప్రత్యేకంగా మన సత్యసాయి సంస్థలయందు అట్టి పవిత్రమైన సేవకులు లక్షలమంది వుంటున్నారు కనుకనే యింత పవిత్రమైన గొప్ప సమావేశము జరుపుకోగలిగాం.

లోకములో గొప్ప ఉపన్యాసములిచ్చే మహనీయులు ఎందరో వుంటున్నారు. మాటల

యందు మేధా శక్తిని ప్రవేశపెట్టే మహనీయులెందరో వుంటున్నారు. కాని ఆచరించి ఆచరింపచేసే వ్యక్తులు లేరు. ఇక్కడ ఆచరించి ఆచరింపచేయగల ఒక శక్తి ఒక్కటి మాత్రమే వుంటున్నది. నేను ఏమి చెప్తున్నానో అది చేస్తున్నాను. ఏది చేస్తున్నానో అది చెప్తున్నాను. అది మా విద్యార్థులంకే చక్కగా తెలుసు. ప్రేమ.ప్రేమ. నేను ప్రేమిస్తున్నాను. మిమ్మల్ని ప్రేమించమని చెబుతున్నాను. నాకు వుండిన పెద్ద ప్రోపర్టీ ప్రేమనే. ఈశక్తి ఆశక్తి ఆ మిరకిల్ యీ మిరకిల్ అని వర్ణిస్తారు. కాని అది కాదు నా నిజమైన మిరకిల్. ప్రేమనే పెద్ద మిరకిల్. ఈ ప్రేమ అందరు కూడను భాగాన్ని వహించాలి. అప్పుడే బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి రెండింటి ఏకత్వముగా మారిపోతుంది.

ట దివ్యాత్మ స్వరూపులారా! మీరందరు ఈ సేవాసంస్థలను దినదినాభివృద్ధిగా వింద టానికి తగిన కృషి చేయండి. అందరిని చేర్చుకోండి. అందరు చేరండి. అందరు భగవంతుని బిడ్డలుగా మీరు విశ్వసించండి. ఎవరికి సేవ చేస్తున్నా మా సోదరి సోదరులకు చేస్తున్నామని భావించండి. అప్పుడే భగవంతుడు మిమ్ము ఆశీర్వదిస్తాడు. భగవంతుని శరణాగతి పొందుతారు. ఇందులో ఏమీ సందేహమూ లేదు. అతి శీఘ్రకాలములోనే యిట్టి దివ్యమైన అనుభూతిని మీరు అనుభవిస్తారు. నిజముగా యీ సంస్థనుంచి పోయినవారు దురదృష్టవంతులు. మీరందరు దురదృష్టవంతులు కాకుండా అదృష్టవంతులుగా మారాలి. ఎలాంటి పరిస్థితులయందు సంస్థలను వీడకుండా చూచుకోవాలి. సంస్థనే మీ ప్రాణముగా విశ్వసించాలి. ఇదే నిజమైన ధ్యానము. ఇదే నిజమైన తపస్సు. ఇలాంటి దీక్షను బూని సత్ఫలం పొందండి. అదే నేను ఆశించే ఆశయము. స్వామి ప్రేమ నిరంతరమూ మీవెంటనే జంటనే యింటనే కంటనే వుంటున్నది.

1990 నవంబరు 24వ తేదీ శనివారం, శాంతివేదిక, శ్రీసత్యసాయి హిల్ వ్యూ స్టేడియం, భగవాన్ బాబావారి దివ్యసందేశం